ప్రజాశక్తి
శనివారం 1 జూన్ 2024
5
పార్వతీపురం మన్యం

కిడ్నీ బాధితులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గ్రామస్తులతో మాట్లాడుతున్న రెడ్డి వేణు

మండలంలోని పెద్దూరుకు చెందిన పలువురు కిడ్నీ బాధితులను సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, కార్యదర్శివర్గ సభ్యులు యమ్మల మన్మధరావు శుక్రవారం పరామర్శించారు. అనంతరం బాధితులను సమస్యలు అడిగి తెలుకున్నారు. ఇప్పటికే ఇద్దరు కిడ్నీ వ్యాధి బారినపడి మరణించారని, మరో15 మంది వరకు బాధితులున్నట్టు తెలిపారు. ప్రస్తుతం కొంతమంది బాధితులు డయాలసిస్ చేసుకుంటున్నార న్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి తగిన పరీక్షలు జరిపినట్లయితే ఇంకా కొంత బాధితులను గుర్తించవచ్చుని నాయకులు కోరారు.

జూన్ మాసం వచ్చిందంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఒకటే టెన్షన్. ముఖ్యంగా చదువుకునే పిల్లలున్న ఇళ్లలో మరింత ఆందోళన ఉంటుంది. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం ఇలా అన్ని ఖర్చులూ ఒకే సారి వస్తాయి. ఇక ఖరీఫ్ సీజన్ కూడా ఈ నెల నుంచే ప్రారంభం అవుతుంది. తొలకరి వర్షాలు పడడంతో రైతులు ఖరీఫ్ సేద్యాన్ని ప్రారంభిస్తారు. పంటల సాగు నిమిత్తం పెట్టుబడుల కోసం రైతుల వెతుకులాట ప్రారంభం అవుతుంది. ఓ వైపు విద్యా సంవత్సరం.. మరో వైపు ఖరీఫ్ సీజన్ ఒకే సారి ప్రాంభం కావడంతో అన్ని కుటుంబాలపైనా ఏదో ఒక రూపంలో జూన్ భారం పడుతుంది.

- ప్రజాశక్తి, విజయనగరం

అమ్మో జూన్

- భారీగా పెరిగిన ఫీజులు, వ్యవసాయ పెట్టుబడుల భారం
- తలలు పట్టుకుంటున్న తల్లిదండ్రులు, రైతులు

ఫీజుల భారం..!

వేసవి సెలవులు ముగింపు దశకు వచ్చేశాయి. మరో 10 రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ప్రయివేటు పాఠశాలలు తెరిచారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లను చేసేశారు. పుస్తకాలు వచ్చాయని, వెంటనే తీసుకోవాలని, లేదంటే ఉండవని తల్లిదండ్రులకు ఫోన్లుమీద ఫోన్లు చేస్తున్నారు. పుస్తకాలు కొనుగోలు చేయాలంటే ముందస్తు ఫీజు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇద్దరు విద్యార్థులున్న కుటుంబంలో ప్రయివేటు పాఠశాల అయితే రూ.50వేలు, కార్పొరేట్ పాఠశాల అయతే రూ.80వేలకు పైగా ఖర్చు చేయాల్సి ఉంది. ఫీజుల మోతతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతోంది. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, అమ్మఒడి లాంటి పథకాల అమలు చేస్తున్నా ఇవి పెరిగిన పుస్తకాలు, ఫీజుల ధరలకు ఏ మూలకూ సరిపోవడం లేదు. విజయనగరం ఉమ్మడి జిల్లాలో 320 వరకు ప్రయివేటు పాఠశాలలు, 30 వరకు కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు లక్ష మందికి పైగానే విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ నోట్ల కట్టలతోనే పాఠశాలలకు వెళ్లాలి. నర్సరీ స్థాయి నుంచే ఫీజుల రూపంలో రూ.25 నుంచి రూ.50వేల వరకు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్నాయి. విద్యార్థి తరగతి పెరిగే కొద్దీ ఫీజుల భారం కూడా పెరుగుతూ పోతోంది. హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, యూని ఫామ్స్ ఇలా అన్నింటికీ లక్షల్లోనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇంట్లో ఇద్దరు పిల్లల ఉంటే ప్రస్తుతం కొంత ఫీజు కట్టి, పుస్తకాలు, యూనిఫాం తీసుకోవాలంటే రూ.70వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఇంటర్, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు అయితే వారు చదివే కళాశాలలను బట్టి ఒక్కొక్కరికి హాస్టల్, ఫీజులకు రూ.3 లక్షల వరకు ఖర్చు వస్తోంది. టెక్నో, సిబ్యాచ్, ఐకాన్, ఐపిఎల్, నీట్, ఎంసెట్, జెఇఇ, జెఇఇ అడ్వాన్స్‌డ్ తదితర వాటికి మరింత అదనంగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. డబ్బున్న వారికి ఇది పెద్ద సమస్య కాకున్నా సామాన్యులు, చిరుద్యోగులకు పెనుభారంగానే ఉంటోంది. ఫీజుల నియంత్రణ అంటూ ప్రభుత్వాలు చెబుతున్న మాటలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి. ప్రభుత్వం ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులను క్రమబద్ధీకరించి ఫీజుల వసూళ్లపై నిఘా ఉంచితే సామాన్యులకు విద్య భారం కాకుండా ఉటుంది.

నోట్ల కట్టలతో విద్యాలయాలకు..!

ఒకప్పుడు విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో విద్యాలయానికి వెళ్లే వారు. కార్పొరేట్ విద్యా వ్యాపారం రాకతో తల్లిదండ్రులు నోట్ల కట్టలతో అక్కడికి వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. గడిచిన పదేళ్ల కాలంలో వందలు వేలుగా, వేలు లక్షలుగా ఫీజులు పెరిగాయి. కార్పొరేట్ పాఠశాల అంటే చాలు లక్షల్లోనే ఫీజుల మాట విన్పిస్తోంది. అది కూడా ఎల్‌కెజి, యుకేజీ స్థాయికే ఈ స్థాయిలో డబ్బులను తల్లిదండ్రులతో లాగేస్తున్నారు. తమ పిల్లలు తమలా కాకుండా.. మంచిగా జీవితంలో స్థిర పడాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు వారి కష్టాన్ని మొత్తం ఫీజుల రూపంలో ప్రయివేటు, కార్పొరేట్‌కు దారబోస్తున్నారు.

రైతులకు పెట్టుబడుల భారం



జూన్ నెల రైతులపై కూడా భారాన్ని తెస్తుంది. ఖరీఫ్ సీజన్ ఈ సమయంలోనే ప్రారంభమై రైతులు పొలం పనులు ఉపక్రమిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సబ్సిడీపై విత్తనాలు, ఎరువుల పంపిణీకి అధికారులు సిద్ధమయ్యారు. గత పది రోజులుగా అడపా దడపా వర్షాలు కురవడంతో పలుచోట్ల రైతులు పొలంలో దుక్కుల పనుల్లో నిమగ్నం అయ్యారు. గతేడాది సరిగా పంటలు చేతికందక పెట్టుబడులు కూడా చేతికి రాలేదు. ఉద్యానవన రైతులు కూడా దిగుబడులు రాక నష్టాలను చవిచూశారు. ఈ నేపథ్యంలో రైతుల చేతిలో చిల్లిగవ్వలేకుండానే వ్యవసాయ పనులను ప్రారంభించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విత్తనాలు, పురుగు మందుల కొనుగోలు, పొలం పనులు, కూలీలు ఇతరత్రా వాటికి ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడులు ఖర్చు చేయాల్సి ఉంది. ఇటీవల ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే ఇది ఉమ్మడి జిల్లాలో 20 శాతం మంది రైతులకు కూడా అందలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెట్టుబడి రాయితీ కింద ఎకరాకు రూ.20వేలు సాయం అందించి పంట సాగును ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు.

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

3 వరోజు

- మూడు రోజుల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఉత్కంఠ రేపుతున్న ఫలితాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

2024 ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్ డౌన్ మొదలైంది. ఇంకా నాలుగు రోజులు సమయం మాత్రమే ఉండడంతో అభ్యర్థులు , రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు , ఉద్యోగులు, ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. జూన్ 4 ఓట్లు లెక్కింపునకు అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఓట్లు లెక్కింపులో పాల్గొనే అధికారులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గరుగుబిల్లి మండలం ఉద్యానవన కళాశాలలో ఇవిఎంలను భద్రపరిచారు. జూన్ 4న మన్యం జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు ఇక్కడ కౌంటింగ్ జరగనుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఓటర్లలో చైతన్యం కనిపించడంతో 77.10 శాతం పోలింగ్ నమోదైంది. కురుపాం నియోజకవర్గంలో 1,94,114మంది ఓటర్లు ఉండగా 1,52,450 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 78.54 శాతం పోలింగ్ నమోదైంది. పాలకొండ నియోజకవర్గంలో 1,95,020 ఓటర్లు ఉండగా 1,46,781 ఓట్లు పోలయ్యాయి. 75.26 శాతం పోలింగ్ నమోదైంది. పార్వతీపురం నియోజకవర్గంలో 1,89,817 ఓటర్లు ఉండగా 1,48,502 మంది ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. 78.23 శాతం పోలింగ్ నమోదైంది. సాలూరు నియోజకవర్గంలో 2,04,489మంది ఓటర్లు ఉండగా 1,56,331 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ 76.45 శాతం పోలింగ్ నమోదైంది.

కురుపాం- 20 రౌండ్లు
పాలకొండ -21 రౌండ్లు
సాలూరు- 18 రౌండ్లు
పార్వతీపురం - 17 రౌండ్లు

కురుపాం అసెంబ్లీ స్థానానికి 268 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఎన్నికలకు 20 రౌండ్లు లో లెక్కింపు జరగనుంది. పాలకొండ నియోజకవర్గానికి 287 పోలింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు 21 రౌండ్లు జరగనుంది. పార్వతీపురం అసెంబ్లీ స్థానానికి 233 కేంద్రాల్లో ఎన్నికలు జరగ్గా 17 రౌండ్లలో ఫలితం రానుంది. సాలూరు అసెంబ్లీ స్థానానికి 243 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఎన్నికలకు 18 రౌండ్లు లెక్కింపు జరగనుంది.

23 రోజులు పాటు ఇవిఎంల్లో దాగివున్న ప్రజల ఓటింగ్ తీర్పుతో అభ్యర్థుల భవితవ్యం ఎలా ఉండబోతుందని 2024 ఎన్నికల ఫలితాల కోసం ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే గెలుపు, ఓటములు, మెజార్టీపై అంచనాలు వేసుకున్నా ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు అభ్యర్థుల్లో ఉత్కంఠ కనిపిస్తోంది. ఈసారి ప్రజలు మార్పు కోరుతూ కొత్తవారికి అవకాశం ఇస్తారా? లేదా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో తాము లబ్ధిపొందామని పాతవారికే పట్టం కడతారా అనే చర్చ ప్రజల్లో ఎక్కువగా వినిపిస్తోంది. ఈసారి ఎన్నికలు ఓటరు నాడి అంతు పట్టని విధంగా ఉన్నాయని గెలుపు ఓటములు ఎన్నికల ఫలితాలు వచ్చేవరకూ చెప్పలేమని పరిశీలకుల సైతం భావిస్తున్నారు. ఏది ఏమైనాప్పటికీ కౌంటింగ్ పూర్తయ్యే వరకు కురుపాం నియోజకవర్గంలో ఏ పార్టీ విజయం సాధిస్తుందో వేచి చూడాల్సిందే.

కురుపాంలో కురుస్తున్న భారీ వర్షం

ఈదురుగాలులతో భారీ వర్షం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రాలతో పాటు ఏజెన్సీలోని పలు గిరిజన గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఈదురు గాలులు, ఉరుములు మెరుపులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఒకవైపు విద్యుత్ కోత మరోవైపు నేపథ్యంలో ఉక్కపోతతో ప్రజలను ఉక్కిరిబిక్కిరవ్వగా సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి కుండపోత వర్షం కురిసింది. అక్కడక్కడ చిన్న చిన్న చెట్టుకొమ్మలు విరిగాయి. ఎదురెదురుగా వచ్చిన వాహనాలు కనబడనంత విస్తారంగా వర్షం కురవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కుండపోత వర్షంతో రోడ్లన్నీ వర్షపు నీటితో జలమయమయ్యాయి. ఇటీవల ఇంత భారీ వర్షం కురిసిన దాఖలాల్లేవని, ఎండ వేడిమి నుండి వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలు, గర్భిణీలకు కొంత ఉపశమనం లభించిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రధాన రహదారిపై కూలిన భారీ వృక్షం

గుమ్మలక్ష్మీపురం: మన్యంలో శుక్రవారం సాయంత్రం భారీగా ఈదురు గాలులు వీయడంతో గుమ్మలక్ష్మీపురం - కురుపాం ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహన చోదకులు భయాందోళన చెందారు. మండ వంతెన సమీపంలో ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలింది. దీంతో పార్వతీపురం, కురుపాం నుంచి గుమ్మలక్ష్మీపురం ప్రాంతానికి వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈదురు గాలులతో పాటు ఉరుములు మెరుపులు కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.ఒక్క పూటతో అల్లాడుతున్న ప్రజలు హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

గాలులకు గుమ్మలక్ష్మీపురం వద్ద రోడ్డుకు అడ్డంగా కూలిపోయిన భారీ వృక్షం

ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

రైతుల ముంగిట
నకిలీ విత్తనాల గండం

ముందస్తు హెచ్చరికలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జూన్ నెల మొదటి వారం నుండి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని వాతావరణశాఖ తెలపడంతో రైతులు విత్తనాలు చల్లేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే నారు మడులను సిద్ధం చేసుకున్నారు. ఇదే సందర్భంగా రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని మార్కెట్లో నకిలీ విత్తనాలు వచ్చేశాయి.

మన్యం జిల్లాలో ఎక్కువ మంది రైతులు వరిపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలిస్తే వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు కూడా అంచనా వేస్తున్నారు. అధిక దిగుబడుల కోసం మార్కెట్లో ఉన్న ప్రైవేటు వ్యాపారులు అమ్మే విత్తనాల కోసం రైతులు ఎగబడితే దీన్ని అవకాశంగా తీసుకుని కొంతమంది వ్యాపారులు తక్కువ ధరకు మేలైన విత్తనాల పేరు చెప్పి నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వ్యాపారుల లాభాపేక్షకు ప్రతి ఏడాది నకిలీ విత్తనాల బారిన అధిక సంఖ్యలో రైతులు నష్టపోతున్న నేపథ్యంలో కొనుగోలు సమయంలో తగిన సూచనలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. విత్తనాల కొనుగోలుపై అవగాహన పెంచుకొని ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకుంటే నకిలీ విత్తనాలను ముందే గుర్తించొచ్చని, నష్టపోయినా పరిహారం సైతం పొందచ్చని చెబుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసిన విత్తనాలే కాకుండా తమ అవసరాల నిమిత్తం మార్కెట్లో ప్రైవేటు వ్యాపారుల నుండి కొనుగోలు చేసే విత్తనాలు విషయంలో నకిలీల బారిన పడే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్ని చోట్ల ప్రభుత్వం అనుమతి లేని అనధికార విత్తన వ్యాపారులు తెల్లసంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉన్నందున వారి సమాచారాన్ని తక్షణమే అధికారులకు తెలియజేయాలి. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తనం ధర, కంపెనీ పేరు, అమ్మినవారి సంతకం తప్పనిసరిగా ఉండేలా జాగ్ర త్తలు తీసుకోవాలి. విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్ర బిల్లు తమ పంట చేతికి వచ్చేవరకూ రైతులు భద్రపరచుకోవాలి. విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరీక్షించుకోవాలి. కనీసం 75 శాతం మొలకలుంటేనే వాటిని విత్తనంగా వినియోగిం చుకోవాలి. విత్తన సంచులను రైతుల నమూనా వివరాల కోసం పంట కోతకు వచ్చే వరకూ దాచుకోవాలి.

నకిలీ విత్తనాల బారిన పడితే పరిహారం కోసం ఇలా చేయాలి

విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వ్యాపారుల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి. ఒకవేళ నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. విత్తనాలు నాణ్యమైనవి కాకపోవడం వల్లే దిగుబడి రాలేదని గుర్తిస్తే సదరు విత్తన కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేసి పరిహారం పొం దొచ్చు. దీనికోసం రైతులు తమ విత్తన కొనుగోలు బిల్లు భద్రపరచుకోవాల్సి ఉంటుంది.

ఉత్తీర్ణత ఎక్కువ... కాలేజీలు తక్కువ

- ప్రభుత్వ కాలేజీ సీట్లకు పెరిగిన డిమాండ్
- ప్రవేశాల్లేక డ్రాపౌట్స్‌గా మారనున్న విద్యార్థులు
- నేటి నుంచి కళాశాలల పునః ప్రారంభం

ప్రభుత్వ కాలేజీలో ప్రవేశాలకు క్యూకట్టిన విద్యార్థులు (ఫైల్)

ప్రజాశక్తి - సీతంపేట

విద్య కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని, కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్యను అందిస్తున్నామని పాలకులు ప్రసంగాలకు అడ్డుకట్టే లేదు. అయితే అవి ఆచరణలో కనిపించడం లేదు. విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని, కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ కళాశాలల్లో, పాఠశాలల్లో విద్యను అందిస్తున్నామని పాలకులు చెబుతున్నారు. అయితే పదో తరగతి ఉత్తీర్ణత అయిన విద్యార్థులకు తగ్గట్టుగా కాలేజీల్లేకపోవడంతో వారు విద్యను దూరమవుతున్నారు. కాస్త ఆర్థికస్థోమత ఉన్న విద్యార్థులు ప్రైవేట్ కాలేజీల్లో చేరుతున్నారు. పేద విద్యార్థులు పదో తరగతితో చదువుకు చెప్పడంతో డ్రాప్ అవుట్‌గా మారనున్నారు. ఈ పరిస్థితి కేవలం సీతంపేట ఐటిడిఎ పరిధిలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఉంది.

సీతంపేట మండలంలో ఈ విద్యా సంవత్సరానికి 13 ఆశ్రమ ఉన్నత పాఠశాలు, మూడు గురుకులాలు, ఒక కెజిబివి, 18 ప్రభుత్వ ఉన్నత పాఠశాల 18 పాఠశాలల నుంచి సుమారు 1000 మంది విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత చెందారు. అయితే విద్యార్థుల ఉత్తీర్ణత తగ్గట్టుగా కళాశాలల్లేకపోవడంతో సీటు రాక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సీట్లు రాకపోవడంతో జూన్ ఒకటో తేదీ నుంచి కళాశాలలు ప్రారంభమవ్వడంతో క్లాసులకు మిస్ అవుతామమన్న ఆందోళన విద్యార్థుల్లో మొదలైంది. సీతంపేట బాలుర గురుకుల కళాశాలల ఈనెల 22న ప్రవేశాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. గిరిజన బాలుర గురుకుల కళాశాలలో ఎంపిసి, బైపిసి, హెచ్ఇసి ఒకేషనల్ 170 సీట్లకు 382 దరఖాస్తులు వచ్చాయి. సీతంపేట బాలికల గురుకుల కళాశాలలో 140 సీట్లుకు 635 దరఖాస్తులు స్వీకరించారు. అలాగే మండలంలోని మల్లి ప్రతిభ కళాశాలలో ప్రవేశాలకు కేవలం పీటీజీ విద్యార్థులు మాత్రమే ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 80 సీట్లకు 286 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకున్నారు. కెజిబివి బాలికల ఎంపిహెచ్ డబ్ల్యు కళాశాలలో 36 సీట్లకు 131 దరఖాస్తులు వచ్చాయి. సీతంపేటలో హై స్కూల్ ప్లస్ కో ఎడ్యుకేషన్ కళాశాల ఈ ఏడాది నుండే ప్రారంభం కానుంది. ఇక్కడ విద్యార్థులకు ఈ కళాశాల ప్రారంభం అవుతుందని ప్రచారం లేదు. అయినా విద్యార్థులకు సరిపడా సీట్లు లేకపోవడంతో నిరాశ మిగిలింది.

ఈఏడాది పదో తరగతిలో వెయ్యి మంది విద్యార్థులు మండలంలో ఉత్తీర్ణత చెందితే ఐదు కళాశాలలో సుమారు 500 మంది విద్యార్థులు చదువుకోడానికి మాత్రమే సరిపడా ప్రవేశాలకు సీట్లు కల్పించారు. ముందు చూపుతోనే గిరిజన సంక్షేమ అధికారులు ఏడేళ్ల క్రితమే ప్రతి ఏటా హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, సీతంపేట గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, ధోనుభాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయాలని గిరిజన సంక్షేమ శాఖకు ప్రతిపాదనలు పంపించారు. సుమారు ఏడేళ్ల నుంచి అధికారులు ప్రతిపాదనలు పంపించిన ప్రభుత్వం కార్యరూపం దాల్చలేదు. దీంతో సగానికి పైగా విద్యార్థులకు సీట్లు లభించకపోవడంతో డ్రాపౌట్లుగా మిగిలిపోనున్నారు.

ప్రతిపాదనను పంపించాం

ఒక్కొక్క గ్రూపుకు పది సీట్లు చొప్పున పెంచాలని గిరిజన సంక్షేమ శాఖకు ప్రతిపాదనలు పంపించాం. దాంతో పాటు ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదనలు గతంలో పంపించాం. ఇంకా మంజూరు కాలేదు.

ఎం.అన్నదొర,
డిప్యూటీ డైరెక్టర్ గిరిజన సంక్షేమ శాఖ,
సీతంపేట ఐటిడిఎ

అగ్నిగుండంగా మన్యం

- అత్యధికంగా సాలూరులో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- బయటకు వచ్చేందుకు భయపడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రుతుపవనాల ప్రవేశానికి ముందుగా తన ప్రతాపం చూపిస్తున్న భానుడు శుక్రవారం అన్ని మండలాల్లోనూ నిప్పులు కురిపించడంతో జిల్లా అగ్నిగుండంగా మారింది. పెరిగిన ఉష్ణోగ్రతలతో పాటు వేడి వడగాడ్పులు వీస్తుండడంతో ప్రజలు వేసవితాపాన్ని భరించలేక విలవిలలాడారు. ఉదయం 7 గంటలకే ఇంటి నుంచి బయట దాటడానికి ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, చిన్నారులు నిప్పులు కొలిమిలా మారిన వాతావరణాన్ని తట్టుకోలేక కొన్నిచోట్ల డీహైడ్రేషన్‌కు లోనయ్యారు. భానుడితాపానికి జిల్లా ప్రజలు ఎలా ఇబ్బంది పడ్డారో శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలను చూస్తే అర్థం మౌతుంది. అత్యధికంగా సాలూరు మండలంలో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిలిగిన మండలాల్లో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి 38.6 డిగ్రీలు, జియ్యమ్మవలసలో 41.6, కొమరాడ 39.1, సీతంపేట, సీతానగరం మండలాల్లో 44, బలిజిపేట 40.5, భామిని 40.3, మక్కువ 39.5, పార్వతీపురం, పాచిపెంట 40.4, కురుపాం, గుమ్మలక్ష్మీపురంలో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణం వేడెక్కడంతో ఉపాధిహామీ కూలీలు పనులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారు. రానున్న రోజుల్లో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ, విపత్తుల నివారణ శాఖకు చెందిన అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అధిక ఉష్ణోగ్రతల వల్ల డీహైడ్రేషన్ పెరిగే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఉదయం 10గంటల తర్వాత బయటకు రాకూడదని, వచ్చినా నూలు దుస్తులు ధరించడం, శీతలపానీయాలు సేవించడంతో పాటు తప్పని సరిగా తలకు టోపీలు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పూల్‌బాగ్‌లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో ఈ ఏడాది ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆశాఖ సహాయ సంచాలకులు జివిబి జగదీష్ తెలిపారు. పాఠశాలలో మొత్తం 65 మంది విద్యార్థులకు గాను 38 మంది అంధ బాలురు, బాలికలకు ప్రవేశం కల్పించేందుకు ఖాళీలు ఉన్నాయని, 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు బ్రెయిలీ లిపి ద్వారా ప్రత్యేక విద్య అందిస్తామని తెలిపారు. 6 నుంచి 14 సంవత్సరాలలోపు వయసు కలిగి, కనీసం 40శాతం అంధత్వం గల బాల బాలికలు అర్హులని తెలిపారు. ప్రవేశ సమయాన నిర్దేశించిన వైద్య ధ్రువీకరణ (సదరం సర్టిఫికేట్) తదితర పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.

సాధారణ పాఠశాలలో విద్య నభ్యసిస్తూ దృష్టిలోపం గల బాల బాలికలు సంబంధిత బదిలీ, వైద్య ధ్రువీకరణ పత్రాలను సమర్పించడం ద్వారా ప్రవేశము పొందవచ్చని తెలిపారు. పాఠశాలలో ఉచిత వసతి, ఆహారం , ఆధునిక బ్రెయిలీ సామగ్రితో విద్య, ఐఎఫ్‌పి. స్మార్ట్ క్లాసెస్ , కంప్యూటర్ పరిజ్ఞానంలో ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆసక్తి గల బాల బాలికలు నేరుగా ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల , విజయనగరం ప్రదానాచార్యులను లేదా ఇతర వివరాలకు 98317548039, 7989592141, 9676702530, 9100587844, 9441713278 నెంబర్‌లను సంప్రదించాలని తెలిపారు.

పాలిసెట్ ప్రవేశాల షెడ్యూల్లో మార్పులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జూన్ మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజులపాటు 144 సెక్షన్ విధింపు కారణంగా విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా పాలిసెట్ 2024 అడ్మిషన్ల ప్రక్రియలో మార్పులు జరిగినట్టు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ విలియం కేరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల వెరిఫికేషన్ తదితరు ఆన్‌లైన్ ప్రక్రియ తేదీల్లో ఎటువంటి మార్పు లేదని, జూన్ 2 వరకు అవకాశం ఉంటుందన్నారు. 3న ఉన్న ధ్రువపత్రాల పరిశీలన జూన్ 6న నిర్వహిస్తామని, ప్రత్యేక కేటగిరి అభ్యర్థులకు సైతం ఇదే వర్తిస్తుందని పేర్కొన్నారు. జూన్ 7 నుండి 10 వరకు ఐచ్ఛికాల నమోదుకు అవకాశం ఉంటు ందన్నారు. జూన్ 11న ఐచ్ఛికాల మార్పుకు అవకాశం ఉంటుందన్నారు. జూన్ 13న సీట్ల కేటాయింపును పూర్తి చేస్తామని కమిషనర్ వివరించారన్నారు. జూన్ 14 నుండి 19 వరకు 6 రోజుల్లోపు ప్రవేశాలు ఖరారైన విద్యార్థులు ఆయా పాలిటెక్నిక్లలో వ్యక్తిగతంగా, ఆన్లైన్ విధానంలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూన్ 14 నుండే రాష్ట్ర వ్యాప్తంగా తరగతులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.

రైతులకు విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్ పాల్

కుడ్డపల్లిలో విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో కుడ్డపల్లి రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీపై విత్తనాలను రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరిజన రైతులకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మండలంలో 16 47 క్వింటాలు ధాన్యం విత్తనాలకు కేటాయించగా, మొదటి విడత 1028 క్వింటాళ్ల అన్ని రకాల ధాన్యం విత్తనాలు ఆర్‌బికెల్లో 90 శాతం సబ్సిడీపై దొరుకుతాయని అన్నారు. రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుని 10 శాతం చెల్లించి తీసుకోవాలన్నారు. రాగులు, కొర్రలు విత్తనాలు 11 కింటాలు వచ్చాయని, 74 కింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావున రైతులు వీటిని వినియోగించుకోవాలన్నారు ఖరీఫ్‌పై రైతులకు సూచనలు సలహాలు ఇవ్వాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎడిఎ రత్నకుమారి, మండల వ్యవసాయాధికారి పి.శ్రీదేవి, విఎఎ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎపిఒ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఎపిఒ వై.రోషి రెడ్డి సేవలు మరువలేనివని పిఒ శుభం బన్సల్ అన్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ నిజాయితీకి మారుపేరు రోషి రెడ్డి అని అన్నారు. ఎప్పుడూ నిరాడంబరంగా ఉంటారని కొనియాడారు. ఈ రెండేళ్ల గిరిజనులకు, అధికారులకు అనేక సేవలు అందించారని తెలిపారు. అనంతరం ఆయన్ను శాలువతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ సింహాచలం, డిప్యూటీ డిఇఒ పి.నారాయడు, పిహెచ్ఒ గణేష్, పిఎఒ హరికృష్ణ, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఎఎంఒ కోటి బాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతాంజలి

ఫ్రీజం -10 పై సమీక్ష

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక వెలుగు సమావేశ మందిరంలో ఫ్రీజం-10 వారాంతపు సమీక్ష సమావేశం ఎంపిడిఒ కె.గీతాంజలి ఆధ్వర్యాన జరిగింది. గర్భిణులపై వైద్యసిబ్బంది, ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రక్తహీనతపై దృష్టి సారించాలన్నారు. అలాగే పౌష్టికాహారం అందించాలన్నారు. మూడో కాన్పు లేదా అంతకన్నా ఎక్కువ కాన్పులు ఉన్న గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేలా అన్నిశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో సిడిపిఒ ఇ.రంగలక్ష్మి, ఇఒపిఆర్‌డి కె.సత్యం, ఎపిఎం విజయకుమారి, వైద్యాధికారులు సత్యవేణి, చాందిని తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు రైతుకు బాగు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తేనే రైతు ఆర్థికంగా అభివృద్ధి అయ్యేందుకు అవకాశం ఉంటుందని ఎన్‌ఎఫ్ఎ జి.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని సంతోషపురం రైతు భరోసా కేంద్రం వద్ద నవ ధాన్య విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పలు సూచనలు చేశారు. వరి సాగు చేసే ముందుకు నవధాన్యాలు వేసుకోవాలని సూచించారు. పచ్చి రొట్ట బాగా వస్తుందని, దీన్ని 45 రోజులు తర్వాత కలియదున్నాలన్నారు. వరి నాట్లు వేసిముందు కలియ దున్నుకోవాలన్నారు. దీని వల్ల మొక్కకు కావాల్సిన అన్ని రకాల సూక్ష్మ, స్థూల పోషకాలు అందుతాయన్నారు. భూమి గుల్లబారి వానపాములు అభివృద్ధి చెందుతాయని, భూమిలో కార్బన శాతం పెరుగుతుందని తెలిపారు. అంతేకాక ఎటువంటి తెగుళ్ల సూచించారు. విఎఎ హరీష్, రైతులు పాల్గొన్నారు.

బలిజిపేట : గంగాడలో వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

పలు గ్రామాల్లో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని గంగాడ, గళావిల్లిలో కార్డెన్ సెర్చ్, పరిశీలన శుక్రవారం నిర్వహించారు. పార్వతీపురం రూరల్ సిఐ, ఎస్సైల సమక్షంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో దొంగతనానికి గురైన 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నాటు సారా స్థావరాలను కూడా తనిఖీ చేశారు. అనంతరం సిఐ కె.రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నాటు సారా తయారీచేసినా, కొనుగోలు చేసినా, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ పత్రాలు పొందకుండా ఉన్న వాహనాలను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో బలిజిపేట, సీతానగరం ఎస్ఐలు పాపారావు, ఎం.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువ : స్థానిక బిసి, ఎస్‌సి కాలనీల్లో శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఎస్సై పి నరసింహమూర్తి తెలిపారు. అపరిచిత వ్యక్తులు, ఏ విధమైన రికార్డుల్లేని వాహనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కౌంటింగ్ నేపథ్యంలో 144వ సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులు గుంపులుగా ఉండరాదని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంధకారంలో గ్రామాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో పాటు భారీ గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల చెట్లు విరిగిపోవడంతో వీరఘట్టంతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అంధకారంలోనే ఉన్నారు. భయంకరమైన మెరుపులు, ఉరుములు పడడంతో ప్రజలు భయమందోళనకు గురయ్యారు. ఇదిలా ఉండగా గత కొద్దిరోజులుగా భానుడు తన ప్రతాపం చూపడంతో ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం : డిఎంఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు ప్రజలకు సూచించారు. మండలంలోని ఉద్దవోలులో శుక్రవారం ఫ్రైడే, డ్రైడే, పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. కాలువల్లో దోమల లార్వా నిరోధక రసాయనాల పిచికారీ చేయించడం, అలాగే కాలువల్లో పూడికతీతలు జరుగుతున్న తీరును పరిశీలించారు. తద్వారా నీటి నిల్వలు పేరుకుపోకుండా , దోమల లార్వా వృద్ధి చెందకుండా ఉండి, దోమల వల్ల ప్రబలే సీజనల్ జ్వరాలు అదుపులో ఉంటాయన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, కాలువల్లో చెత్తాచెదారాలు వేయరాదని స్థానికులకు సూచించారు. దోమలు సంభావ్యత గల ప్రాంతాలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. డ్రైడే, విసిహెచ్ యాప్‌ల్లో వివరాలు అదే రోజు ఆన్లైన్ నమోదు చేయాలన్నారు.



ధూమపానం అనర్థాలను ప్రజలకు వివరిస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

పొగాకు ప్రాణాలకు ప్రమాదం

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఉద్ధవోలులో వైద్య సిబ్బంది నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డిఎంఒ జగన్ మోహనరావు పలు సూచనలు చేశారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. పొగ తాగే వారితో పాటు, వారి చుట్టూ ఉండే వారు ఆ పొగ పీల్చడం వల్ల పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. శరీరంలో ముఖ్యమైన అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. క్యాన్సర్, పలు దీర్ఘ కాలిక రోగాలకు గురవుతారన్నారు. శ్వాస సంబంధమైన, దృష్టి సమస్యలు, పక్షవాతం, రక్త నాళాలు గట్టిపడడం, సంతానోత్పత్తి తగ్గిపోవడం, ఎముకలు బలహీనపడడం మొదలగు ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత శ్రద్ధ కనబర్చాలన్నారు. అంతేకాక పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పొగతాగడం ప్రాణానికి ముప్పని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, విబిడి కన్సల్టెంట్ రామచంద్ర, సూపర్వైజర్ ఉదయకుమారి, వైద్య సిబ్బంది పార్వతి, మౌనిక, దుర్గాప్రసాద్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని దోమల వ్యాప్తి చెందకుండా 21 పంచాయతీల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేపడుతున్నట్టు ఎంపిడిఒ దేవకుమార్ తెలిపారు. అన్ని పంచాయతీల్లో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

సర్టిఫికెట్లతో పాఠశాలకు హాజరవ్వాలి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి సంబంధించి అర్హులైన విద్యార్థుల ఎంపిక నిమిత్తం మెరిట్ జాబితా విడుదలైనట్టు ప్రిన్సిపల్ వి. రామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపికైన 6, ఇంటర్ మొదటి సంవత్సరానికి అర్హులైన విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాఠశాలకు జూన్ 1 నుంచి అందజేయాలని కోరారు.

గొర్రెల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని, వేసవిలో జీవాలకు నీరు లేక నిలుపుకోవడానికి స్థలాలు లేక కాపరులకు ఎటువంటి రక్షణ లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని, కావున ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రండి అచ్యుతరావు కోరారు. మండలంలోని గొర్రెల కాపరులు సమస్యలపై పెంపకం దారులైన ఎర్ర రమణమూర్తి, లండ సత్యం, బోను సింహాచలంతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. జీవాలు మేపుకోవడానికి పాత రహదారులు కూడా లేకుండా చేస్తున్నారని, చెరువు గట్టులను కూడా కొంతమంది ఆక్రమించుకుంటున్నారని అన్నారు. దీనివల్ల జీవాలను నిలుపుకోవడానికి స్థలం లేక వేసవిలో తాగునీరు లేక ఈ వత్తి తప్ప మరో మార్గంలేని పెంపకందారులు వృత్తిని వదిలి ఇతర ప్రాంతాలకు వలసలుపోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. జిఒ 559, 1016 ప్రకారం జీవాలు నిలుపుకోవడానికి స్థలాలు, కొండలకు దారులు, చెరువు గట్టుమీద మేత కోసం అవకాశం కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో గొర్రెల పెంపకండారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఉపాధి హామీ పనులను సక్రమంగా చేపట్టాలని, ప్రతి వేతనదారునికి రోజు వారి కూలి రూ.600 ఇవ్వాలని, ఏడాదికి కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని, పనిచేసే చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో నార్లవలస పంచాయతీ పెద్దవలస, మూలవలస గ్రామాల్లో ఉపాధికూలీలతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, దీంతో కనీస వేతనాలు రావడం లేదని అన్నారు. అలాగే పనిచేసే చోట మౌలిక సదుపాయాల్లేవని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయకుండా, బడ్జెట్‌లో తగినన్ని నిధులు మంజూరు చేయకుండా ప్రతి ఏటా కోతలు పెడుతున్నాయన్నారు. గతంలో పెద్దవలసలో వేతనదారులు సుమారు 8 వారాల పాటు పనిచేస్తే నేటికీ వారికి బిల్లులు చెల్లించలేదన్నారు. తమకు బిల్లులు చెల్లించమని అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఏడాదికి 200 రోజులు పని ఇవ్వాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా రూ.600 రోజు వేతనం చెల్లించాలని, ఒక్క పూట మాత్రమే పెట్టాలని డిమాండ్ చేశారు. కూలీలంతా ఉపాధిహామీ చట్ట రక్షణకు కలిసికట్టుగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అలాగే భరిణికవలస గ్రామస్తులకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు కూనేటి చినబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గెమ్మెల రామకృష్ణ, సోములు, అప్పలస్వామి, కంచూరి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేతనదారులనుద్దేశించి మాట్లాడుతున్న మర్రి శ్రీనివాసరావు

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఓట్ల లెక్కింపు అయ్యేంతవరకు డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ సమీపంలో ఉన్నఉల్లి భద్ర, ఎర్రనకప గుడి వద్ద ఉన్న ఇళ్లల్లో గానీ, షాపుల వద్ద గానీ కొత్త వ్యక్తులను అనుమతించొద్దని ఎస్ఐ అమ్మన్నరావు సూచించారు. ఈ మేరకు ఎర్రన్న గుడి జంక్షన్ వద్ద ఉన్న షాపులకు ముందస్తు నోటీసులు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రమైన హార్టికల్చర్ కాలేజీ పరిసర ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణ కల్పించేందుకు ప్రజల సహకరించాలన్నారు. ఓట్లు లెక్కింపు అయిన మరుసటి రోజు కూడా ఎవరు ఎలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని, అలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు.

పార్వతీపురం టౌన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్ఐ రవీంద్ర రాజు అన్నారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంతో ఉండాలని, ఎలాంటి రాజకీయ తగాదాలు, గొడవలు, కవింపు చర్యలు, అవాంఛనీయమైన సంఘటనలకు దిగితే, ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎంతటి వారి పైన అయినా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సురేష్ కుమార్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం : పట్టణ ప్రజలకు 144సెక్షన్ గురించి వివరిస్తున్న ఎస్ఐ

ఇళ్ల వద్దకే పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

లబ్ధిదారులందరికీ ఇళ్ల వద్దే సామాజిక పింఛన్లు ఇవ్వాలని మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూనరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ, పంచాయితీ, సచివాలయ సిబ్బందిని ఉపయోగించి లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పింఛన్లు అందజేయాలన్నారు. లబ్ధిదారులు ఇబ్బందులపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలని కోరారు. వాలంటీర్లు లేకపోతే పింఛన్లు పంపిణీ చేయలేకపోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు, వాలంటీర్ లేకపోతే వ్యవస్థలు ఆగిపోతాయా, పింఛన్ పంపిణీ చేయలేదా అని ప్రశ్నించారు, జూన్ నెలకు సంబంధించి ప్రతి లబ్ధిదారునికి సామాజిక భద్రత పింఛన్ ఇంటి వద్దకే ఇవ్వాలని కోరారు. వృద్ధులు వారి అకౌంట్లో డబ్బులు వేస్తే ఎండ తీవ్రతకు ఇబ్బంది పడి బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నారని, వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని కనుక ఎన్నికల కమిషన్ దృష్టి సారించి ఇంటింటికి లబ్ధిదారులకు అందించాలని కోరారు, ప్రజలకు మేలు చేయాలన్న దృక్పథం లేకుండా అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. లబ్ధిదారులు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ఎన్నికల కమిషన్ ఇంటింటికి పెన్షన్ డబ్బులు ఇవ్వాలని ఆదేశించాలని కోరారు.

పార్వతీపురం టౌన్ : ఈ నెలకు సంబంధించి ప్రతి లబ్ధిదారునికి సామాజిక భద్రత పింఛన్లను ఇంటివద్దకే ఇవ్వాలని జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పింఛన్లను లబ్ధిదారులకు ఇంటికి ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులపడే అవకాశం ఉందని, గిరిజన ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు దూరప్రాంతాల నుండి బ్యాంకులకు వెళ్లి పడిగాపులు కాయాల్సివస్తుందన్నారు. అంతేకాక ప్రస్తుతం మండుతున్న ఎండలకు వృద్ధులు వడదెబ్బకు లోనయ్యే ప్రమాదం ఉందని, అలాగే పింఛన్ కోసం బ్యాంకుకు రాకపోకలు సాగిస్తే వచ్చిన కొద్దిపాటి మొత్తంలో కొంత ఖర్చయ్యే అవకాశం ఉందన్నారు. కావున వారి ఇబ్బందులను ఎన్నికల కమిషన్ దృష్టిలో పెట్టుకొని సామాజిక భద్రత పెన్షన్లు ప్రతి లబ్ధిదారునికి ఇంటింటికి వెళ్లి ఇచ్చేలా చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఏప్రిల్‌లో సచివాలయ, పంచాయతీ సిబ్బందిచే ఇచ్చారనేది ఈ సందర్భంగా గుర్తు చేశారు. మేలో మాత్రం లబ్ధిదారులు బ్యాంకు ఖాతాలో జమ చేయడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఏప్రిల్‌లో ఇవ్వగలిగిన పింఛన్లను మే నుండి ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. పింఛన్ కోసం నెల రోజులు ఎదురు చూసే లబ్ధిదారులకు ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. వాలంటీర్లు లేకపోతే వ్యవస్థలన్నీ ఆగిపోతాయా అని ఎద్దేవా చేశారు. రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులను ఉపయోగించి ప్రతి లబ్ధిదారునికి ఇంటికి వెళ్లి పింఛను పంపిణీ చేయాలన్నారు.

మత్స్యకార రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండుటెండలకు చెరువులోని నీరు వేడి కావడంతో చేపలు చనిపోయిన సందర్భంగా మత్స్యకార రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అందజేశారు. అనంతరం సాంబమూర్తి, మత్స్యకార రైతులు ఎస్ నారాయణరావు, ఎస్.శంకర్రావు మాట్లాడుతూ కొమరాడలోని పట్నాయకుని చెరువులో ఏడు మత్స్యకారులు కుటుంబాలు వర్షాకాలంలో రూ.లక్షా50 వేలు విలువచేసే చిన్న చేప పిల్లల్ని తెచ్చి ఆ చెరువులో పెంచారన్నారు. ఇలాంటి సందర్భంలో అన్ని విధాలా కష్టపడి చేపలు పెంచుకోగా, ఇప్పుడు అమ్మడానికి అందికొచ్చిన సమయంలో గడిచిన పది రోజులుగా మండుటెండలు విపరీతంగా ఉండడంతో చెరువుల్లో నీరు బాగా వేడికి ఆ చెరువులో ఉన్న చేపలు ఎండకి తట్టుకోలేక చనిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మత్స్యకార రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. కావున మత్స్య శాఖ అధికారులు స్పందించి చనిపోయిన చేపలను పరిశీలించి దర్యాప్తు చేపట్టి అన్ని విధాలా మత్స్యకారులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మత్సకార రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో నలుగురు యువకులకు గాయాలయ్యాయి. వీరిని వెంటనే 108 వాహనంలో తగరపువలసలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన సవరవల్లి సమీపంలోని అమనం జంక్షన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సవరవల్లి గ్రామానికి చెందిన బోర రమేష్, గారి గణేష్, బోర జగన్.. ముగ్గురు ఒకే బైకుపై పోలిపల్లి వైపు నుంచి సవరవల్లి వైపు వస్తున్నారు. అదే మార్గంలో పోలిపల్లి వైపు ఒడిశా రాష్ట్రం జైపూర్ జిల్లాకు చెందిన జావేద్ అక్తర్ వస్తున్నాడు. ఏమైందో తెలియదు గానీ రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బోర రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

గాబువానిపేటలో చోరీ

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని ముంజేరు పంచాయతీ గాబువానిపేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బీరువాలో ఉన్న పదివేల నగదు, రెండు తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ రవికుమార్ కథనం ప్రకారం... ఎండాకాలం కావడంతో నక్క రాంబాబు తన భార్య రమతో కలిసి డాబాపై పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం బీరువాలో ఉన్న నగదు, ఆభరణాలను దోచుకున్నారు. నక్క రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

వేసవి కాలం కావడంతో గ్రామాల్లో ప్రజలు ఆరు బయట, మేడపై నిద్రిస్తున్నారు. దీన్ని అవకాశంగా తీసుకొని దొంగలు ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారం దొంగిలించుకుని పోతున్నారు. భోగాపురం మండల ప్రజలంతా ఈ విషయమై అప్రమత్తంగా ఉండాలి. రాత్రిపూట ఎవరైనా అనుమానితుల కదలికలను గమనిస్తే వెంటనే డయల్ 100కి గాని, భోగాపురం పోలీస్ స్టేషన్ నెంబర్ 9154879651, 9121109445కు గాని వెంటనే తెలియజేయాలి.

ఘటనా స్థలంలో మృతిచెందిన పాడుగు కిశోర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని పెద్ద చెరువు రామానాయుడు రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. లంకాపట్నానికి చెందిన పాడుగు కిశోర్(19), పాడుగు హేమంత్(18) ఇద్దరూ కలసి కోట వద్ద నున్న తన అమ్మమ్మకు క్యారేజి ఇచ్చి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా, వేగం వెళ్తూ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో తల ఛిద్రం కావడంతో పాడుగు కిశోర్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను జిల్లా కేంద్రాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. వీరి మృతితో లంకాపట్నంలో విషాదం అలుముకుంది.

నేరాలు ఘోరాలు

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో వంబరెల్లి ఘాట్ రోడ్ వద్ద సోమవారం ఆటో బోల్తా పడి లోయలో పడిన ఘనటలో తీవ్రంగా గాయపడ్డ సవర అనిత (33) విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శుక్రవారం ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. ప్రమాదంలో అనితకు బలమైన గాయం కావడంతో కెజిహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు ఇదిలా ఉండగా సంఘటనలో మృతుల సంఖ్య ఇద్దరికి చేరింది.

రైలు నుంచి జారిపడి మహిళకు గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక రైల్వే స్టేషన్ వద్ద రైలు ట్రైన్ ఎక్కే ప్రయత్నంలో కాలుజారి ట్రైన్ కింద పడిన ఘటన శుక్రవారం జరిగింది. జీఆర్పీ పోలీసుల వివరాల ప్రకారం.. మక్కువ మండలం డి-శిర్లాంకు చెందిన కృష్ణవేణి గోపాలపట్నం వెళ్లేందుకు పార్వతీపురం స్టేషన్‌కు చేరుకుంది. ఈ క్రమంలో రన్నింగ్లో ఉన్న సమతా ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు ప్రయత్నించగా, కాలుజారి కింద పడింది. ప్రమాదంలో మహిళ కాలు తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. పోలీసులు వివరాలు నమోదు చేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణారావు

హత్య కేసును ఛేదిస్తే బయటపడ్డ మరోకేసు

ప్రజాశక్తి-పాలకొండ

ఒక హత్యకేసును పోలీసు చేధిస్తుండగా, మరో హత్యకు కేసు బయటపడింది. సీతంపేట మండలం పులిపుట్టి సమీపాన గల ఎర్ర చెరువు వద్ద కొద్ది రోజుల క్రితం గుర్తు తెలియని మహిళ హత్యకు గురైంది. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేయగా, ఇందుకు సంబంధించిన మరో హత్య బయటపడింది. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక డిఎస్‌పి జివి కృష్ణారావు విలేకరులకు శుక్రవారం వివరించారు. వివరాలిలా ఉన్నాయి.

ఒడిశాకు చెందిన జోసెఫ్ బుయాన్, మైకేల్ ఇరువురు స్నేహితులు. జోసెఫ్ బుయాన్ తన వద్ద కాయిన్ వుందని, అమ్ముతానని చెప్పి మైకేల్‌కు ఎర వేసి లక్ష రూపాయలు తీసుకున్నారు. కొంత కాలం తర్వాత మైకేల్ కాయిన్‌ను జోసేఫ్‌ను అడగ్గా, కాయిన్ ఇవ్వకపోగా అతడ్ని హత్య చేశాడు. హత్య అనంతరం మైకేల్ భార్య రూట్ భుయాన్ వల్ల తాను పోలీసులకు దొరికిపోతానని, ఆమెను కూడా హత్య చేసేందుకు కుట్ర పన్నాడు. ఇందులో భాగంగా సీతంపేట మండలం పులుపుట్టి సమీపంలోని ఎర్ర చెరువు వద్దకు ఆమె తీసుకువచ్చి కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసి పరారయ్యాడు. అప్పటి నుంచి గాలిస్తున్న పోలీసులు కేసును చేధించారు. ఒక హత్య కేసును విచారిస్తే మరో హత్య కేసు వెలుగు చూసింది. రెండు హత్యలను తానే చేసినట్లు ముద్దాయి జోసఫ్ బుయాన్ అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు. ఈ రెండు హత్యలకు జోసెఫ్ బూయాన్ వాడిన కత్తి, చీటింగ్‌కి ఉపయోగించిన కాయిన్, మైకేల్ వద్ద తీసుకున్న లక్ష రూపాయలను పోలీసులు మీడియా సమక్షంలో నేరస్థుడిని ప్రవేశపెట్టారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ ముద్దాయి జోసెఫ్ బుయాన్‌ను అదుపులోకి తీసుకున్నామని, కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు పంపుతున్నామని తెలిపారు. ప్రజలు ఎవరూ ఇటువంటి చీటింగ్‌లను నమ్మొద్దని, గుర్తు తెలియని వ్యక్తులను కూడా నమ్మవద్దని డిఎస్పి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి కీలక పాత్ర వహించిన పోలీసులను, క్రైమ్ పోలీసులకు డిఎస్‌పి అభినందించారు. ఈ రెండు హత్య కేసులను చేధించడంలో ఒడిశా వెళ్లి కేసును చేదించి చాకచక్యంగా ముద్దాయిను తీసుకురావడంలో కీలక పాత్ర వహించిన పాలకొండ సిఐ ఎం.చంద్రమౌళిని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ, ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.